న్యూస్‌రీల్

ఏడు నెలల గర్భిణికి అరుదైన చికిత్స



నరసరావుపేట: స్థానిక శకుంతల జనరల్ అండ్ గ్యాస్ట్రో లివర్ కేర్‌లో ఏడు నెలల గర్భిణికి ఎండోస్కోపీ ద్వారా అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించినట్లు ఆహాస్పిటల్ డాక్టర్ ఐలా శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. కాకాని శ్రీ దివ్య అనే మహిళ పొట్టనొప్పి, కామెర్లతో ఇబ్బందిపడుతూ తమను సంప్రదించిందన్నారు. ఆమెను పరీక్షించి కామెర్లకు కారణం పసరునాళంలోకి రాళ్లు జారటంగా గుర్తించి ఎండోస్కోపీ ద్వారా ఎటువంటి కుట్లు, కోత, రేడియేషన్ లేకుండా ఈఆర్‌సీపీ శస్త్రచికిత్స ద్వారా పసరునాళంలో స్టంట్ అమర్చటం చేశామన్నారు. ఇటువంటివి చాలా శస్త్ర చికిత్సలు అరుదుగా జరుగుతాయన్నారు. పల్నాడు జిల్లాలో తొలిసారిగా ఒక గర్భిణికి ఇటువంటి శస్త్ర చికిత్స చేశామన్నారు. తమకు రోగ నివారణ చేసిన డాక్టర్ శ్రీనివాస్‌ను రోగి, ఆమెబంధువులు కృతజ్ఞతలు తెలియచేశారు.

కోడింగ్‌పై ఉచిత శిక్షణ

వినుకొండ: ఇంటర్మీడియట్ ఎంపీసీ గ్రూప్ పూర్తిచేసి బీటెక్‌లో చేరబోయే విద్యార్థినీ, విద్యార్థులకు ఉచితంగా కోడింగ్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఇందూరి రామాంజిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు జూన్ 1వ తేదీ నుంచి సాయంత్రం 5 గంటలకు విఠంరాజుపల్లి సాయిబాబా గుడి దేవస్థానం పక్కన ఉన్న ఇనిస్ట్యూట్‌లో హాజరుకావాలన్నారు. శిక్షణకు వచ్చే విద్యార్థులు మొబైల్ ఫోన్ లేదా ల్యాప్‌టాప్ లేక, ట్యాబ్ కచ్చితంగా తీసుకొని రావాలని తెలియజేశారు.

మంచినీటి చెరువులు పరిశీలించిన అధికారులు



ఈపూరు(శావల్యాపురం): మండలంలోని ఉన్న రక్షిత మంచినీటి చెరువులన్నీ ఆర్‌డబ్ల్యూఎస్, ఎన్నెస్పీ, పంచాయతీ అధికారులు ప్రజాప్రతినిధుల సారథ్యంలో సాగర్ జలాలతో నూరుశాతం నింపేలా చర్యలు చేపట్టినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.రత్నబాబు తెలిపారు. బుధవారం ఈపూరు మండలంలోని పానుగోటివారిపాలెం, అగ్నిగుండాల, బొగ్గర, కొండ్రముట్ల గ్రామాల్లోని రక్షిత మంచినీటి చెరువులను సందర్శించి సాగర్ జలాల నింపే విధానాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈనెల 30 వరకు సాగర్ జలాలు విడుదల అవుతాయని చెరువులన్నీ నూరుశాతం సమన్వయంతో నింపుతామన్నారు. ఆయనతో పాటు సర్పంచి వడ్లమూడి రాఘవ, ఎన్నెస్పీ డీఈ శ్రీదేవి, ఏఈ టి. విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

6న యడ్లపాడు మండల పరిషత్ సమావేశం

యడ్లపాడు: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం 6వ తేదీన ఉదయం 11 గంటలకు ఎంపీపీ పిడతల ఝాన్సీసాగర్ అధ్యక్షతన జరగనున్నది. ఈ సమావేశం గురించి ఎంపీడీవో హేమలత దేవి మంగళవారం సమాచారం ఇచ్చారు. మండలంలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష జరగనున్నదని, ఎంపీపీ అనుమతితో ఇతర ముఖ్య అంశాలపై కూడా చర్చించనున్నట్లు ఆమె తెలిపారు. సదరు సమావేశానికి మండల ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, సర్పంచ్‌లు తప్పనిసరిగా హాజరుకావాల్సిందిగా కోరారు. అలాగే మండలంలోని వివిధ శాఖలకు చెందిన అధికారులంతా తమ శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని సూచించారు.

సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన



వినుకొండ: మండలంలోని ఏనుగుపాలెం, పిట్టంబండ, ఉమ్మడివరం గ్రామాల్లో సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటరెడ్డి, మండల రీసోర్స్ కోఆర్డినేటర్ ప్రభాకరరావులు మాట్లాడుతూ సైడ్ కాలువల్లో ప్లాస్టిక్ గ్లాసులు, ప్లాస్టిక్ బాటిల్స్, చెత్త అట్టముక్కలు కాలువలో వేయవద్దని నీటి ప్రవాహం ఆగిపోయి దోమలు, ఈగలు వాలి మన కంటికి కనపడని సూక్ష్మజీవుల వల్ల వ్యాధులు వస్తాయని తెలిపారు. సచివాలయ సిబ్బంది, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

తపాలా జీవిత బీమా చెక్కు అందజేత

నరసరావుపేటటౌన్: బాధిత కుటుంబ సభ్యులకు తపాలా జీవిత బీమా చెక్కును అందించినట్లు పోస్టల్ సూపరింటెండెంట్ పి.వెంకటస్వామి బుధవారం తెలిపారు. నరసరావుపేటకు చెందిన పమిడి పద్మజ తపాలా జీవిత బీమా పాలసీ రూ.10 లక్షలకు తీసుకొని ఆమె గుండె పోటుతో మృతి చెందిందన్నారు. దీంతో ఆమె భర్త పమిడి ప్రభాకర్‌కు రూ.12.20 లక్షల చెక్కు నగదు కార్యాలయంలో అందజేసినట్లు తెలిపారు.

వచ్చే ఎన్నికల్లో గిరిజన ప్రాంతాలన్నీ వైఎస్సార్ సీపీవే

- గిరిజన యూనివర్సిటీ, మెడికల్ కళాశాల ఏర్పాటు చేసింది జగనన్నే
- యువతను కూటమి ప్రభుత్వం మోసం చేస్తోంది
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- ఎస్టీ, యూత్ విభాగ అధ్యక్షులకు అభినందన



మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డితో ఎస్టీ విభాగ అధ్యక్షులు మొగిలి ఆంజనేయులు, నాయకులు

నరసరావుపేట: రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్నీ గిరిజన ప్రాంతాల్లో వైఎస్సార్ సీపీ గెలుస్తోందని మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ పార్టీ ఎస్టీ విభాగం అధ్యక్షులుగా నియమితులైన మొగిలి ఆంజనేయులు, యూత్ విభాగ అధ్యక్షులుగా నియమితులైన కోటపాటి మణింద్రారెడ్డి తమ మద్దతుదార్లతో డాక్టర్ గోపిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ యువకులు, ఉత్సాహవంతులు, అందర్నీ కలుపుకొనిపోయే మనస్తత్వం ఉన్న మొగిలి ఆంజనేయులుకు ఎస్టీ విభాగం అధ్యక్షులుగాను, యూత్‌వింగ్ అధ్యక్షులుగా కోటపాటి మణింద్రరెడ్డిని నియమించడం చాలా ఆనందంగా ఉందన్నారు. వీరు పార్టీలో క్రియాశీలకంగా బాధ్యతగా పనిచేస్తూ పార్టీకి సంబంధించిన అన్నీ కార్యక్రమాలలో పాల్గొంటూ పార్టీ కోసం కష్టపడి పనిచేసే మనస్తత్వం ఉన్న వ్యక్తులని, వారిని ఎంపిక చేయటం సంతోషకరమని అన్నారు. పార్టీ కోసం బాధ్యతగా పనిచేసి రాబోయే రోజుల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా తిరిగి గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీకి అంకిత భావంతో పనిచేస్తూ అన్నీ వార్డులు తిరిగి అందరినీ కలుపుకొని పోతూ యువతను సమీకరించి పార్టీలో ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మణీంద్ర రెడ్డికి సూచించారు.

గిరిజనుల కోసం ఎన్నో కార్యక్రమాలు చేశాం

రాష్ట్రంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గిరిజనుల కోసం అనేక మంచి కార్యక్రమాలు చేశామని, పాడేరులో గిరిజన యూనివర్సిటీ, మెడికల్ కాలేజీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ ప్రాంతానికి మెడికల్ కాలేజీ ఒక వరం లాంటిదని, గతంలో వైద్య చికిత్సల కోసం ఆ ప్రాంతంలోని ప్రజలు 250 కిలోమీటర్లు నడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం ఈ మెడికల్ కాలేజీ వల్ల గిరిజనులకు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందుతుందని చెప్పారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం గిరిజనులకోసం చేసిందేమి లేదన్నారు. అందువల్ల రాబోయే ఎన్నికల్లో అన్నీ గిరిజన ప్రాంతాల్లో పార్టీ విజయబావుటా ఎగురవేస్తుందని స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వం యువతను మోసం చేసిందని, వారికి 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వలేని పక్షంలో నిరుద్యోగ భృతి ఇస్తానని ఎన్నికల ముందు హామీఇచ్చి ఇప్పుడు మోసం చేస్తోందన్నారు. అదే విధంగా ఉద్యోగస్తులు కూడా రోడ్డు ఎక్కే పరిస్థితి వచ్చిందన్నారు. అన్ని వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, అవినీతి విచ్చలవిడిగా పెరిగిపోయిందన్నారు. ఎక్కడా పేదలకు బియ్యం అందటంలేదని, జగనన్న ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన ఇంటింటికీ రేషన్ వాహనాలను ప్రస్తుత ప్రభుత్వం తీసేస్తుందన్నారు. భవిష్యత్‌లో ఎవరికీ బియ్యం దొరికే పరిస్థితి ఉండదన్నారు.

సబ్సిడీ బియ్యంలో భారీ కుంభకోణం!

నియోజకవర్గంలో సబ్సిడీ బియాన్ని నాయకులు నెలకు రూ.26 లక్షలకు అమ్ముకుంటూ భారీ కుంభకోణం చేస్తున్నారని, పనికి ఆహార పథకం సగం డబ్బులు మీకు, సగం డబ్బులు నాకు అనే రీతిన సాగుతోందని ఆరోపించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు సగం డబ్బులు తీసుకొని కూలీలకు సగం డబ్బులు మాత్రమే ఇస్తున్నారని, అదేవిధంగా పేదలకు పెన్షన్ తొలగిస్తున్నారని, ఇంతవరకు ఒక్క కొత్త పెన్షన్ కూడా ఇచ్చిన దాఖలాలు లేవని, అదేవిధంగా జూన్ 12న తల్లికి వందనం పథకం ఇస్తామన్నారని, ఇంతవరకు దీనికి సంబంధించి గైడ్‌లైన్స్ ఇవ్వలేదన్నారు. అది ఎంతవరకు అమలు చేస్తారో గ్యారెంటీ లేదని చెప్పారు. అదేవిధంగా ఆగస్టు 15న ఉచిత బస్సు పథకం అమలు చేస్తామంటున్నారని, ఈ పథకానికి రెండువేల బస్సులు కావాలని, ఇంతవరకు బస్సులు కొన్న దాఖలాలు, డ్రైవర్స్ రిక్రూట్ చేసుకున్న దాఖలాలు లేవని, ఈ పథకం ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు.

అటకెక్కిన హామీలు-పథకాలు

అదేవిధంగా ఎన్నికల ముందు ఇచ్చిన ఒక్క హామీ, ఒక్క పథకం కూడా అమలు చేయట్లేదని, రియల్ ఎస్టేట్ వ్యాపారం పూర్తిగా పడిపోయిందని అన్నారు. వ్యాపారస్తులకు వ్యాపారాలు లేవు అని, రాష్ట్రంలో ఆరోగ్య మిత్రల ఉద్యోగాలు తొలగిస్తున్నారని ఆందోళనలో సమ్మెలకు దిగుతున్నారని, ఈ సమస్యలన్నిటిపై యువత అవగాహన పెంచుకొని వారిని సమీకరించి ఈ అవినీతి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు చేసి తిరిగి వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని సూచించారు. స్టేట్ ఇంటలెక్చ్యువల్ ఫోరం కార్యదర్శి ఇయం.స్వామి, ఎస్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పాలపర్తి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు మద్దిరెడ్డి నరసింహారెడ్డి, షేక్ కరిముల్లా, గంటనపాటి గాబ్రియేలు, భూమిరెడ్డి కొండారెడ్డి తదితరులు పాల్గొని నూతనంగా ఎన్నికైన ఇరువురికి శుభాకాంక్షలు తెలియచేశారు.

ఒంటికి యోగా మంచిదేగా !



నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్ల గ్రామ సచివాలయం వద్ద బుధవారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ ఏవీ రమణ, ఎంపీడీవో స్వరూపరాణి, ఈవోపీఆర్డీ నిర్మల లక్ష్మీకుమారి, పంచాయతీ కార్యదర్శి మక్కెన సుబ్బారావు, వెలుగు సీసీ సాంబశివరావు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నెలరోజుల పాటూ యోగాంధ్ర కార్యక్రమం తలపెట్టిన నేపథ్యంలో ఉదయం యోగాసనాలు వేసి, యోగాతో లాభాల గురించి వివరించారు. ప్రతిరోజూ కనీసం గంట పాటూ యోగాసనాలు వేస్తే మెరుగైన ఆరోగ్యం పొందవచ్చని అధికారులు పేర్కొన్నారు.

యడ్లపాడు మండలంలో...

యడ్లపాడు: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యడ్లపాడు మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో బుధవారం 'యోగాంధ్ర' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపర్చే ఉద్దేశంతో యోగా తాలూకు ప్రాముఖ్యతను ప్రజల్లో పెంపొందించేందుకు అవగాహన కార్యక్రమాలు, పోటీలు ఏర్పాటు చేశారు. శ్వాసపట్ల ధ్యాసతో మానసిక ప్రశాంతత, శ్వాసకోశ సంబంధిత ఆరోగ్య సమస్యల నివారణకు ప్రాణాయామాలపై అవగాహన కల్పించారు. యడ్లపాడు గ్రామ సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో వి. హేమలతాదేవి, యడ్లపాడు ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారి భరద్వాజ, పంచాయతీ కార్యదర్శి శశికళ, సచివాలయ, ఆరోగ్య సిబ్బంది, వ్యాయామోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి



నరసరావుపేటలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కమిషనర్, అధికారులు, సిబ్బంది

నరసరావుపేట: ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ అధికారులు బుధవారం ఎన్టీ రామారావు జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కమిషనర్ ఎం.జస్వంతరావు, అధికారులు పూలు చల్లి నివాళులు అర్పించారు.

యడ్లపాడు: ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం యడ్లపాడు తహసీల్దార్ కార్యాలయంలో మాజీ సీఎం స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు

నాదెండ్ల: మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీరామారావు జయంతి వేడుకలు అన్ని గ్రామంల్లో ఘనంగా జరిగాయి. గ్రామాల్లోని ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కెల్లంపల్లి అచ్చయ్య, వడ్లమూడి రవీంద్ర నాయకులు పాల్గొన్నారు.

వినుకొండ : స్వర్గీయ ఎన్టీఆర్ జయంతి సందర్భంగా గుమ్మడి ఆశ్రమంలో కళాకారులకు, స్వచ్ఛంద సేవా సంస్థలకు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో భాగంగా గత మూడు సంవత్సరాలుగా యంగ్ స్టార్ హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేసిన సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు పమిడిపల్లి అనిల్, సభ్యులు పాల్గొన్నారు.

వినుకొండ సినిమాహాళ్లలో అధికారుల తనిఖీలు



వినుకొండ: జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పట్టణంలోని పలు సినిమా థియేటర్లలో రెవెన్యూ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని సురేష్‌మహల్, కీర్తి డీలక్స్, అరుణ సినిమా హాల్స్‌లో పారిశుద్ధ్యం, టికెట్ల ధర, లైసెన్సు, స్టాల్స్‌లో ధరల వివరాలు అడిగి తెలుసుకున్నారు. తహసీల్దారు సురేష్ నాయక్ మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు సినిమా థియేటర్లలో తనిఖీలు చేపట్టామన్నారు. అధిక ధరలకు తినుబండారాల విక్రయాలు జరిపినా, లైసెన్సు లేకపోయినా, పారిశుద్ధ్యం సక్రమంగా లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ విధానంలో మార్పు

తహసీల్దార్ విజయశ్రీ



యడ్లపాడు: ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జూన్ 1వ తేదీ నుంచి రేషన్ బియ్యం పంపిణీ తిరిగి రేషన్ షాపుల వద్దనే నిర్వహించనున్నట్టు తహసీల్దార్ జెట్టి విజయశ్రీ బుధవారం తెలిపారు. గతంలో ఎండీయూ వాహనాల ద్వారా సరుకులు పంపిణీ చేసిన విధానాన్ని ప్రభుత్వం పూర్తిగా నిలిపివేసిందని, ఇకపై మళ్లీ షాపుల నుంచే పంపిణీ జరుగుతుందని వెల్లడించారు. రేషన్ డీలర్లు ప్రభుత్వ లైసెన్సు పొందిన షాపుల్లోనే నిత్యావసర వస్తువుల పంపిణీ చేపట్టా లని ఆమె సూచించారు. అంతేగాక, షాపుల్లో స్టాక్ నిల్వ సామర్థ్యం, డిజిటల్ తూకాల వాడకాన్ని అధికారులు పరిశీలించి అనుమతినిస్తారని పేర్కొన్నారు. పంపిణీ వివరాలు, సమయాల బోర్డులు షాపుల్లో ఏర్పాటు చేయాలన్నారు. 60 ఏళ్ల పైబడి వృద్ధులు, దివ్యాంగుల జాబితాను గుర్తించి, వారికి సరుకులు ఇంటి వద్దకే అందించాలని ఆమె ఆదేశించారు. ఇప్పటికే డీలర్లతో సమావేశం నిర్వహించి అన్ని మార్గదర్శకాలు తెలియజేశామని, జూన్ 1 నుండి ఈ కొత్త విధానం అమల్లోకి వస్తుందని తెలిపారు. అలాగే కలెక్టర్ ఆదేశాల మేరకు రెడ్ క్రాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు తహసిల్దార్ తెలిపారు. ఈ శిబిరం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరుగుతుందని చెప్పారు.

శావల్యాపురం: ఇక నుంచి రేషన్‌డీలర్లు రేషన్ దుకాణాల వద్దనే రేషన్ పంపిణీ పారదర్శకంగా నిర్వహించాలని తహసీల్దారు యం.అర్జున్‌నాయక్ సూచించారు. బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రేషన్ డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామపంచాయతీల్లో 25 రేషన్ దుకాణాలు, 11 వేల కార్డులు ఉన్నాయని ప్రభుత్వ నిబంధనలు మేరకు వచ్చే నెల 1వ తేదీ నుంచి రేషన్ కార్డుదారులకు దుకాణాలు వద్దనే రేషన్ పంచదార పంపిణీ డీలర్లు చేయాలన్నారు. ప్రతి నెల 16వ తేదీ వరకు రేషన్ షాపుల్లో రేషన్ పంపిణీ చేయాలని, సమయాభావం మేరకు షాపులు నిర్వహణ చేయాలన్నారు. మండలంలో కార్డుదారుల నుంచి ఫిర్యాదులకు తావులేకుండా రేషన్‌డీలర్లు తమ విధులు బాధ్యతగా నిర్వహించాలన్నారు. ఇక నుంచి రేషన్ పంపిణీ ఎండీయూ వాహనాలు ద్వారా పంపిణీ చేయటం ప్రభుత్వ నిబంధనలు మేరకు నిలుపుదల చేసినట్లు తెలిపారు.

పమిడిమర్రులో కార్డెన్ సెర్చ్



తనిఖీల్లో పాల్గొన్న పోలీసులు



స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు

నరసరావుపేట రూరల్: ఐక్యతతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని రూరల్ సీఐ పి.రామకృష్ణ తెలిపారు. మండలంలోని పమిడిమర్రు గ్రామంలో బుధవారం తెల్లవారుజామున రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఎనిమిది సీఐలు, 15 మంది ఎస్‌ఐలు, 80 మంది సిబ్బంది తనీఖీల్లో పాల్గొన్నారు. గ్రామంలోని అనుమానితులు ఇళ్లను, గడ్డివాములు, దుకాణాలు, బడ్డీకొట్లలో తనిఖీలు చేశారు. పలు కేసుల్లో నిందితులతో సమావేశం ఏర్పాటుచేసి పాత పంథాను మార్చుకోమని సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. పోలీసుల తనిఖీల్లో సరైన ధృవపత్రాలు లేని 63 ద్విచక్రవాహనాలు, మూడు ఆటోలతో పాటు గొడ్డళ్లు, కర్రలు, పలుగులు ఇతర మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ రామకృష్ణ మాట్లాడుతూ పోలీసు రికార్డుల్లో పమిడిమర్రు సమస్యాత్మక గ్రామంగా ఉందని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకొని మండలంలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించినట్టు తెలిపారు. సంఘ వ్యతిరేక శక్తులు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వ్యక్తులు సామాన్య ప్రజలకు ఇబ్బందులకు గురిచేయకుండా మేమున్నామనే భావనను ప్రజలకు కల్పిస్తున్నట్టు తెలిపారు. అక్రమ మద్యం అమ్మకాలు, గంజాయి, నాటు సారా నియంత్రణకు సహకరించాలని గ్రామస్తులను కోరారు. గ్రామంలో ఏదైన సమస్య వచ్చినప్పుడు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకుండా పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. తనిఖీల్లో వన్‌టౌన్ సీఐ ఎంవీ చరణ్, టూటౌన్ సీఐ హైమారావు, ఎస్‌ఐలు కిషోర్, వంశీకృష్ణ, అశోక్ పాల్గొన్నారు.

ఫిల్టర్ బెడ్స్ నిర్మాణానికి రూ.10 లక్షలు

శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామంలో రక్షిత మంచినీటి చెరువు తాగునీరు ఫిల్టర్ అయ్యేలా చర్యలు చేపట్టినట్లు పంచాయతీ కార్యదర్శి మిరియాల జ్యోత్స్నరాణి బుధవారం తెలిపారు. పంచాయతీ నిధులు రూ.10 లక్షల వ్యయంతో మంచినీటి చెరువులో ప్రత్యేకంగా ఫిల్టర్ బెడ్స్ ఏర్పాటు చేయడానికి పంచాయతీ సభ్యులు తీర్మానం చేశామని, గ్రామపెద్దల సహకారంతో ఆర్‌డబ్ల్యూ ఏఈకు తీర్మానం చేసిన ధ్రువీకరణ పత్రాలను అందజేస్తామన్నారు. ఆర్‌డబ్ల్యూ అధికారుల నుంచి సాంకేతిక అనుమతులు రాగానే గ్రామపెద్దలు అధికారులు సారథ్యంలో పనులు ప్రారంభిస్తామన్నారు.

భగవద్గీతపై విస్తృత ప్రచారం

యడ్లపాడు: మండలంలోని యడ్లపాడు, తిమ్మాపురం, దింతెనపాడు గ్రామాల్లో బుధవారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి – ఇందూ జ్ఞాన వేదిక నరసరావుపేట కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ జ్ఞాన గ్రంథాల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కర్మయోగం, భక్తియోగం, బ్రహ్మయోగం వంటివి దైవ ధర్మాలుగా చెప్పబడ్డాయని కమిటీ సభ్యులు స్థానిక ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నరసరావుపేట కమిటీ అధ్యక్షుడు ఘడియం పెద్దరెడ్డి, సభ్యులు ఎలిశెట్టి రమేష్, రామాంజనేయులు, పగడాల రామయ్య, అశోక్, చల్లగుండ్ల భాస్కరరావు, కోవూరి చిన్న వెంకటేశ్వర్లు, పెరుగు ఏడుకొండలు, సానికొమ్ము రాజశేఖరరెడ్డి, వెచ్చా రాజేష్ పాల్గొన్నారు.

బాబూరావు సేవలు మరువలేనివి

కొరిటెపాడు (గుంటూరు): ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం ఉమ్మడి గుంటూరు జిల్లా సభ్యుడు బాబురావు సేవలు మరువలేనివని ఏపీ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు వి.పాపారావు కొనియాడారు. మృతి చెందిన బాబూరావు మృతదేహాన్ని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు వి.పాపారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి నరసరావుపేట రూరల్ మండలం, ఇక్కుర్తి గ్రామం చేరుకుని బాబూరావు భౌతికకాయానికి నివాళులు అర్పించారు. నివాళులు అర్పించిన వారిలో అసోసియేషన్ నాయకులు వై.నాగరాజు, ఎం.గురవయ్య, కోటిరెడ్డి, నాగులు తదితరులున్నారు.

హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన

వినుకొండ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో గాయత్రి కల్చరల్ సొసైటీ కళాజాత బృందం పట్టణంలోని బస్టాండ్ నందు వీధి నాటకాల ద్వారా హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్ఐవీ ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుందని, ఎలా వ్యాపించదు, రాకుండా తీసుకోవాలని జాగ్రత్తలు, వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చూపకూడదని పలు అంశాలను నాటకాల ద్వారా వివరించారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఉదయ్‌రాజు, ఐసీడీసీ సెంటర్ కౌన్సిలర్ సురేష్, ఓఆర్‌డబ్ల్యూఎస్ ఆశ, డి.జయ, సీహెచ్. జకరయ్య, డి.రమేష్, వై.విజయ, బి.రిబ్కా, ఎస్‌కె రహమతున్నీసా,శైలజ, కళాజాత బృందం తదితరులు పాల్గొన్నారు.



కాన్పుల సంఖ్య పెరగాలి

ప్రభుత్వ వైద్యశాలలో బయట రోగుల సేవలు (ఓపీ)తో పాటు స్థానికంగా ప్రసూతి కాన్పులు గణనీయంగా పెంచాలని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా అధికారి రవి ఆదేశించారు. నూజెండ్లలో ఉన్న ప్రజా వైద్యశాలను డీఎంహెచ్ఓ బుధవారం తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని వార్డులు, రక్త పరీక్ష కేంద్రం, శస్త్రచికిత్సల గది, ఔషధ నిల్వ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. రోగులకు అందించాల్సిన సేవలపై పలు సూచనలు చేశారు. అనంతరం వైద్యశాల ఆవరణలో ఇటీవల నూతనంగా నిర్మించిన హెల్త్ సెంటర్ నూతన భవనాన్ని ఆయన పరిశీలించారు. త్వరలో హెల్త్ సెంటర్ ప్రారంభించేలా చర్యలు చేపడతామన్నారు. ఆయనతో పాటు వైద్యాధికారి మాలకొండయ్య, వైద్య సిబ్బంది ఉన్నారు.

–నూజెండ్ల



సారూ... ఆస్తులు కాపాడరూ..!!

పట్టణంలోని సత్తెనపల్లిరోడ్డు ఆవులసత్రంకు ఎదురుగా ఉన్న శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వారి దేవస్థానం ఆస్తిని కాపాడాలని పలువురు విశ్వబ్రాహ్మణ సంఘీయులు కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జేసీ సూరజ్ గనోరేకు వినతిపత్రం సమర్పించారు. చిలకలపూడి శారద, ఆమె కుమారుడు నాగబాబు ఎటువంటి హక్కులు లేకుండా దేవస్థానం ఆస్తిని కొందరికి సేల్ డీడ్ ద్వారా ఈనెల 8న అన్యాక్రాంతం చేశారన్నారు. ఈ ఆస్తులను కాపాడుకునేందుకు తమ సంఘం ద్వారా ఎంతవరకైనా పోతామని హెచ్చరించారు. విశ్వబ్రాహ్మణ సంఘ జిల్లా, పట్టణ అధ్యక్షుడు సుతారం వాసు, ప్రధాన కార్యదర్శి బొప్పూడి సాయిప్రసాదు, కోశాధికారివేములూరి రాంబాబు, గురజాల పట్టణ అధ్యక్షులు కుందుర్తి కోటేశ్వరరావు, కొమ్మూరి వెంకటేశ్వర్లు, కల్లూరి శివాచారి, కోటగిరి లక్ష్మణ పాల్గొన్నారు.

–నరసరావుపేట